## క్లుప్తంగా

### నాపై బురద జల్లేందుకే ఈనాడు తప్పుడు కథనం: మల్లాది

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): తనపై బురద జల్లేందుకే ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించిందని సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 'రూ. కోట్ల విలువైన స్థలంపై విష్ణు కన్ను' శీర్షికన ఈనాడులో ప్రచురితమైన కథనాన్ని ఖండిస్తూ ఎమ్మెల్యే మల్లాది విష్ణు గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ ఆస్తులను రక్షించడమే తనకు తెలుసునని విష్ణు ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌పేటలోని జంధ్యాల దక్షిణామూర్తి పాఠశాలకు ఎంతో చరిత్ర ఉందన్నారు. ఈ స్థలం అన్యాక్రాంతానికి గురైందని ఈనాడు తప్పుడు కథనాన్ని ప్రచురించిందని అన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలు పూర్తి స్థాయిలో రక్షించబడ్డాయని తెలిపారు. ప్రజలకు ఈ స్థలంపై ఎటువంటి అపోహలు వద్దని పేర్కొన్నారు.

### అలరించిన హరికథ



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో తాడేపల్లిగూడెంకు చెందిన భాగవతారిణి శారదా హరికథ భక్తులను అలరించింది. అమ్మవారి సన్నిధిలోని ధర్మపథం వేదికపై గురువారం సాయంత్రం పంచహారతుల సేవ అనంతరం శారదా బృందం హరికథను ఆలపించారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన భక్తులు హరికథను ఆద్యంతం ఎంతో ఆసక్తిగా వీక్షించారు. అనంతరం శారదా బృందానికి ఆలయ అధికారులు అమ్మవారి దర్శనం కల్పించి ప్రసాదాలను అందజేశారు.

### దక్షిణామూర్తికి విశేష పూజలు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై మల్లేశ్వరస్వామి వారి ఆలయ ప్రాంగణంలోని దక్షిణామూర్తికి గురువారం విశేష పూజలు నిర్వహించారు. దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ చేశారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈఓ కెఎస్.రామరావు పాల్గొన్నారు. ఆలయ వైదిక కమిటీ సభ్యులు రంగావజ్జుల శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో పూజలను ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

### ఓటు వేస్తే ఉచితంగా కంటి వైద్య పరీక్షలు



పటమట(విజయవాడతూర్పు): ఎన్నికల సంఘం పిలుపు మేరకు ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు తమ ఆస్పత్రి కృషి చేస్తుందని శంకర నేత్ర చికిత్సాలయ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ నాదెళ్ల స్వాతి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికలు జరిగే మే 13వ తేదీ నుంచి జూన్ 20వ తేదీ వరకు ఓటు హక్కు వినియోగించుకున్న వారికి ఉచిత కంటి వైద్య సేవలు అందిస్తామని చెప్పారు. తమ ఓటుహక్కును వినియోగించుకున్నట్లు వేలిపై సిరా ముద్ర చూపితే చాలని తెలిపారు. రోగులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి తక్కువ ఖర్చుతో కంటి శుక్లాల శస్త్ర చికిత్సలు ఫ్యాకో పద్ధతి ద్వారా చేస్తామని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, వర్కింగ్ జర్నలిస్టులకు ఉన్న హెల్త్ స్కీములు తమవద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అవకాశాన్ని విజయవాడ పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ఆమె ఉచిత కంటి వైద్యానికి సంబంధించి రూపొందించిన పోస్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో డాక్టర్లు రోహిత్, జరీనా, అన్నపూర్ణ, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# ఫ్యాను ప్రభంజనంలో కూటమి కొట్టుకుపోతుంది

**వైఎస్సార్ సీపీ సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు**



30వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఫ్యాను ప్రభంజనంలో కూటమి కొట్టుకుపోతుందని సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైఎస్సార్ సీపీకి పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక 30వ డివిజన్ దేవీనగర్‌లో గురువారం ఆయన కార్పొరేటర్ బీ హెచ్ఎస్‌వీ జానారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. గడప గడపకు వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధి, నూతన మేనిఫెస్టోను వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెలంపల్లి మాట్లాడుతూ మేనిఫెస్టోను ఒక పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేసిన ఏకైక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. అటువంటి జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని అభ్యర్థించారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా బడుగు బలహీన వర్గాలు అభివృద్ధి చెందాలన్నా వైఎస్సార్ సీపీతో మాత్రమే సాధ్యమని పేర్కొన్నారు.

**బొండా ఉమాను తరిమికొడతాం..**

మర్యాద తెలియని వ్యక్తి బొండా ఉమా అని, ఆయనకు ఎన్నికల్లో కనీసం ఓటు అడిగే అర్హత కూడా లేదని వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. అధికారంలో ఉండగా ప్రజలను పట్టించుకోకుండా ధనార్జనే ధ్యేయంగా భూకబ్జాలకు పాల్పడిన బొండా ఉమా ఏ మొహం పెట్టుకుని ఓటు అడుగుతారని ప్రశ్నించారు. బొండా కుమారులను అదుపులో పెట్టుకోవాలని లేనిపక్షంలో ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని అన్నారు. రౌడీయిజంతో ప్రజల మనస్సుల్లో స్థానం సంపాదించుకోలేరని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, దళితులపై దాడి చేస్తే బొండా ఉమాను తరిమికొడతామని హెచ్చరించారు.

**కేంద్ర ప్రభుత్వం వల్లే నిత్యావసర ధరలు పెరిగాయి..**

కేంద్ర ప్రభుత్వం వల్లే నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయని దీనికి చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీ సమాధానం చెప్పాలని వెలంపల్లి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ చర్యల వల్ల పెరిగిన ధరలను రాష్ట్ర ప్రభుత్వంపై రుద్దేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు కూటమి చర్యలు, మోసాలను గమనిస్తున్నారని సార్వత్రిక ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్(నాని) భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. వెలంపల్లి శ్రీనివాసరావుకు దారి పొడవునా మహిళలు, పలు పథకాల లబ్ధిదారులు హారతులు ఇస్తూ ఘన స్వాగతం పలికారు. జగనన్న వల్లే తాము ఈ రోజు ఇంత సంతోషంగా ఉన్నామని ఫ్యాను గుర్తుకు ఓటు వేయడానికి సిద్ధంగా ఉన్నామంటూ సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు కే శ్రీనివాసరాజు, సీహెచ్ సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, అమ్ముల వివేకానంద, దుర్గారావు, రఫీ, లీలా, చందు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**61వ డివిజన్‌లో..**

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 61వ డివిజన్ శాంతినగర్, భాస్కరరావుకొట్టు ప్రాంతాల్లో కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవితో కలిసి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ప్రచారం నిర్వహించారు. తనను, ఎంపీ అభ్యర్థి కేశినేని నానిని గెలిపించాలని కోరారు. వెలంపల్లి మాట్లాడుతూ మళ్లీ జగనన్న సీఎం అయితేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. జగనన్న ఎన్నికలకు ముందే సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు బటన్ నొక్కి అందజేస్తే దుర్మార్గుడు చంద్రబాబు పేదలకు సంక్షేమ పథకాల నిధులు అందకుండా అడ్డుపడ్డాడని ఆరోపించారు. గతంలో ఎన్నికల కోడ్ ఉన్నప్పుడే చంద్రబాబు పసుపు కుంకుమ ఎలా అందించారని ప్రశ్నించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జనరల్ సెక్రెటరీ బోను దుర్గానరేష్, ఉమ్మడి వెంకట్రావ్, రాష్ట్ర మైనార్టీ సెల్ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, రంగారెడ్డి, నాగిరెడ్డి, మల్లికార్జునరావు, ఆర్ఎస్ నాయుడు, కార్యకర్తలు పాల్గొన్నారు.



61వ డివిజన్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి



దేవీనగర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా డ్రమ్స్ కొడుతున్న వెలంపల్లి

# వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించండి

**ఎమ్మెల్యే మల్లాది విష్ణు**



పాయకాపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

పాయకాపురం(విజయవాడరూరల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మంచిని చూసి ప్రజలు ఓట్లు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 61వ డివిజన్ పాయకాపురంలో గురువారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ ఉమ్మడి రమాదేవి, వెలంపల్లి అల్లుడు రాందేవ్ గుప్తాతో కలిసి ప్రతీ గడపకు వెళ్లి జగనన్న పాలనలో జరిగిన మేలును వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా రూ. 2.70 లక్షల కోట్లు వివిధ పథకాల ద్వారా అక్క చెల్లెమ్మలకు నేరుగా తమ ప్రభుత్వం లబ్ధి చేకూర్చినట్లు వెల్లడించారు. 99.4 శాతం హామీలను నెరవేర్చినట్లు తెలిపారు. చంద్రబాబు కుట్రలు చేసి సంక్షేమ పథకాలు ఆపగలరేమో కానీ, వైఎస్సార్ సీపీ విజయాన్ని మాత్రం ఆపలేరని స్పష్టంగా చేశారు.

**ఐదేళ్లలో అక్షరాల రూ. 47.68 కోట్ల సంక్షేమం..**

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో డివిజన్‌లో అక్షరాల రూ. 47.68 కోట్ల సంక్షేమాన్ని అందజేసినట్లు వెల్లడించారు. వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా ప్రతి నెల 1,697 మందికి పింఛన్ అందజేస్తున్నట్లు తెలిపారు. వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 6.75 కోట్లు, అమ్మ ఒడి ద్వారా రూ. 5.23 కోట్లు, చేదోడు ద్వారా రూ. 17లక్షలు, ఈబీసీ నేస్తం ద్వారా రూ. 27.45 లక్షల, జగనన్న విద్యాదీవెన ద్వారా రూ. 2.59 కోట్లు, వసతి దీవెన రూ. 88.62 లక్షలు, కాపు నేస్తం రూ. 60 లక్షలు, సున్నా వడ్డీ ద్వారా రూ. 1.03 కోట్లు, వైఎస్సార్ చేయూత ద్వారా రూ. 2.30 కోట్ల సంక్షేమాన్ని డివిజన్ ప్రజలకు అందజేసినట్లు వివరించారు. సీఎం జగన్ ఆలోచనలను, నవరత్నాల పథకాలను తట్టుకుని నిలబడే శక్తి రాష్ట్రంలో ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదని స్పష్టం చేశారు.

**వైఎస్సార్ సీపీపై ప్రజలకు పూర్తి నమ్మకం ఉంది..**

వైఎస్సార్ సీపీ పాలనపై ప్రజలకు అపారమైన నమ్మకం ఉందని, ఆ నమ్మకాన్ని ఎక్కడా వమ్ము చేయకుండా తామంతా పనిచేస్తున్నట్లు మల్లాది విష్ణు తెలిపారు. గత ఐదేళ్లలో డివిజన్‌లో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలే ఇందుకు నిదర్శనమన్నారు. ప్రధానంగా రూ. 84.35 లక్షలతో శాంతినగర్ ప్రధాన రహదారి, రూ. 69 లక్షలతో హెచ్‌బ్లాక్‌లో రహదారులు, రూ. 93 లక్షలతో ప్రశాంతినగర్‌లో నూతనంగా రోడ్లను నిర్మించుకున్నట్లు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 80 లక్షలతో అనేక రహదారులకు మోక్షం లభించిందన్నారు. ఎలక్ట్రిసిటీ కాలనీలో రూ. 30లక్షలు, ప్రగతి నగర్లో రూ. 40 లక్షలతో సిమెంట్ రోడ్లను నిర్మించినట్లు పేర్కొన్నారు. గత టీడీపీ హయాంలో పాయకాపురం చెరువు ఆక్రమణలకు గురికాగా, తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ. 3.71 కోట్లతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. హెచ్ బ్లాక్‌లో రూ. 70 లక్షలతో నూతన సచివాలయ భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని శ్రీనివాస్(నాని), వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి తోట శ్రీనివాసరావు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఉమ్మడి వెంకట్రావ్, జిల్లా కార్యదర్శి మేడా రమేష్, డివిజన్ అధ్యక్షుడు బల్లం కిషోర్, కోఆర్డినేటర్ నాలం బాబు, రాష్ట్ర మైనార్టీ జాయింట్ సెక్రటరీ షేక్ నాగుల్‌మీరా, మీసాల సత్యనారాయణ, అనిల్‌బాబు, ఆర్ఎస్ నాయుడు, మాల కొండయ్య, కేఎస్ఆర్ నాయుడు, నాగరాజు, ప్రకాష్, నాగిరెడ్డి, నాగమణి, రంగారెడ్డి, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నివారణ హోమియో మందుల పంపిణీ



హోమియో మందులు అందజేస్తున్న డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో గురువారం ఆలయకమిటీ ఆధ్వర్యాన వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బ నివారణకు ఉచిత హోమియో మందుల పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని హోమియో మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాము ప్రతీ ఏటా దాతలు, భక్తుల సహకారంతో వేసవి ఎండల బారి నుంచి ప్రజలను రక్షించేందుకు ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ వర్మ నేతృత్వంలో హోమియో మందులు తయారుచేసి అందజేస్తున్నామని అన్నారు. హోమియో మందులు వేసుకోవడం వల్ల వడదెబ్బ నుంచి రక్షణ పొందవచ్చని అన్నారు. ఎండలు తగ్గే వరకు ప్రతి రోజూ మందిరంలో ఉచితంగా హోమియో మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మందిర కోశాధికారి మందలపర్తి సత్యశ్రీహరి, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

# పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణ

**కలెక్టర్ ఢిల్లీరావు**



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల పోలింగ్ నిర్వహణకు పటిష్ట కార్యాచరణతో ఏర్పాట్లు చేపట్టామని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. గురువారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వెలగపూడి రాష్ట్ర సచివాలయం నుంచి ఎన్నికలకు సంబంధించి చివరి 72 గంటల్లో చేయాల్సిన ఏర్పాట్లు, బందోబస్తు ప్రణాళిక అమలు తదితర అంశాలపై జిల్లా ఎన్నికల అధికారులు, ఐజీలు, డీఐజీలు, సీపీలు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీసీకి కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్‌కుమార్, అధికారులతో కలిసి హాజరయ్యారు. పోలింగ్ ప్రక్రియకు సంబంధించి పలు అంశాలపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా సమీక్షించారు. ఎన్నికల ప్రక్రియను విజయవంతంగా పూర్తిచేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ 13న జరిగే ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. సిబ్బందికి నాణ్యమైన శిక్షణనిచ్చామని అన్నారు. భద్రత విషయంలోనూ పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ప్రతి పోలింగ్ లొకేషన్ వద్ద ప్రాథమిక చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. 1,874 పోలింగ్ స్టేషన్లలో 900 క్రిటికల్ పోలింగ్ స్టేషన్లు ఉన్నాయని.. 1,267 కేంద్రాల్లో వెబ్‌క్యాస్టింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. 544 మంది మైక్రో అబ్జర్వర్లు సేవలందించనున్నట్లు వివరించారు. ఈవీఎం ట్రబుల్ షూటింగ్ మెకానిజం తదితర అంశాలను కూడా కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

## తత్కాల్‌లో ఇంటర్ ఫీజు చెల్లింపునకు అవకాశం

పాయకాపురం(విజయవాడరూరల్): ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు రాసే విద్యార్థులు ఫీజు తత్కాల్‌లో ఈ నెల 10వ తేదీ సాయంత్రం మూడు గంటలలోపు చెల్లించడానికి అవకాశం ఉందని ఎన్టీఆర్ జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్(డీఐఈఓ) సీఎస్ఎస్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 24వ తేదీ నుంచి సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు.

# సంక్షేమ సారథి జగనన్నకు అండగా నిలవాలి



రామకృష్ణాపురంలో ఓట్లు అభ్యర్థిస్తున్న వెలంపల్లి శ్రీవాణి



25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వెలంపల్లి శ్రీలక్ష్మి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మహిళల అభ్యున్నతే ధ్యేయంగా పారదర్శక పాలన సాగించిన సంక్షేమ సారథి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి యావత్ మహిళలు అండగా నిలవాలని వెలంపల్లి శ్రీనివాసరావు సతీమణి శ్రీవాణి అన్నారు. స్థానిక 30వ డివిజన్ రామకృష్ణాపురంలో గురువారం వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి లఖంరాజు సునీతతో కలిసి ఆమె ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందించిన పథకాలు వివరిస్తూ ఓట్లు అభ్యర్థించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు కేశినేని నాని, వెలంపల్లి శ్రీనివాసరావును అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ నగరంలో అసలైన అభివృద్ధి అంటే ఏమిటో చేసి చూపించిన గొప్ప ప్రభుత్వం జగనన్న ప్రభుత్వమని సెంట్రల్ ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు కుటుంబ సభ్యులు వెలంపల్లి శ్రీలక్ష్మి అన్నారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ 25వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ బంకా శకుంతలతో కలిసి ఎంప్లాయిమెంట్ ఆఫీసు రోడ్డులో ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిరుపేదలకు మరింత మెరుగైన సంక్షేమ పథకాలు అందాలంటే తిరిగి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావాలన్నారు. ఫ్యాను గుర్తుపై ఓట్లు వేసి ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావులను అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైఎస్సార్ సీపీతోనే సమగ్ర అభివృద్ధి



మధురానగర్‌లో ఓట్లు అభ్యర్థిస్తున్న చక్రవర్తి

మధురానగర్(విజయవాడ సెంట్రల్): వైఎస్సార్ సీపీతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని వెలంపల్లి శ్రీనివాసరావు అల్లుడు మంచుకొండ చక్రవర్తి అన్నారు. స్థానిక 29వ డివిజన్ మధురానగర్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక కార్పొరేటర్ కొంగితల లక్ష్మీపతితో కలిసి గడప గడపకు వెళ్లి ఇచ్చిన ప్రతీ హామీని అమలు చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల కష్టాలు తీరాలన్నా, సంక్షేమ ఫలాలు గడప వద్దకే అందాలన్నా జగనన్న సీఎం కావాలని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

పాయకాపురం(విజయవాడరూరల్): స్థానిక 62వ డివిజన్‌లో ఎంపీ కేశినేని శ్రీనివాస్ సతీమణి కేశినేని పావని, వెలంపల్లి కుటుంబ సభ్యులు వెలంపల్లి శ్రీలక్ష్మి, పార్టీ నాయకుడు ఆలంపూరు విజయ్‌తో కలిసి ఏపీఎస్ రెడ్డి రోడ్డులో గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి కేశినేని శ్రీనివాస్, వెలంపల్లి శ్రీనివాసరావును గెలిపించాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు వీరబాబు, డివిజన్ ఇన్‌చార్జి మస్తాన్‌వలీ, రామిరెడ్డి, బుజ్జి, సుబ్బారెడ్డి, హైమావతి, రాధ, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

64వ డివిజన్ కండ్రిక కాలనీలో ఎమ్మెల్యే వెలంపల్లి కుమార్తె డాక్టర్ సాయి అశ్విత, స్థానిక కార్పొరేటర్ యరగొర్ల తిరుపతమ్మతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఫ్యాను గుర్తుకు ఓట్లు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి వెలంపల్లి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి కేశినేని శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మూకల అప్పారావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నోబుల్ టీచర్స్ అసోసియేషన్(ఎన్టీఏ) రాష్ట్ర అధ్యక్షుడు మూకల అప్పారావు మృతి ఉపాధ్యాయ లోకానికి తీరని లోటని వక్తలు పేర్కొన్నారు. గురువారం ఏపీ ఎన్జీవో అసోసియేషన్ హాలులో అప్పారావు సంస్మరణ సభ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్ వెంకట్రావు అధ్యక్షతన జరిగింది. ఎన్టీఏ ప్రతినిధులు, మాజీ ఎమ్మెల్సీ రామకృష్ణ, ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు, చిరంజీవిరావు, రఘువర్మ అప్పారావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయ సంఘాల నేతలు మైసూరరావు, సీహెచ్ పద్మావతి, శ్రీను, చంద్రశేఖర్, నీలకంఠయ్య తదితరులు పాల్గొన్నారు.



# వైఎస్సార్ సీపీతోనే ఇళ్ల రిజిస్ట్రేషన్ల పరిష్కారం

పాయకాపురం(విజయవాడరూరల్): సెంట్రల్ నియోజకవర్గంలో ఇళ్ల రిజిస్ట్రేషన్ల సమస్య శాశ్వత పరిష్కారానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేసిందని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు ఉపాధ్యక్షుడు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. పాయకాపురంలో గురువారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజల కోసం దివంగత నేత వంగవీటి మోహనరంగా ఆఖరి క్షణం వరకు పోరాటం చేశారని, ఆయన స్ఫూర్తితో 2019 నుంచి ఇప్పటి వరకు పేదల ఇళ్ల రిజిస్ట్రేషన్ కోసం నిర్విరామంగా కృషి చేసినట్లు తెలిపారు. రెవిన్యూ నగరపాలక సంస్థ అధికారులు సమన్వయంతో క్షేత్రస్థాయి సిబ్బందికి సరైన దిశానిర్దేశం చేస్తూ రిజిస్ట్రేషన్ల ప్రక్రియను పూర్తి చేసినట్లు వెల్లడించారు. జీఓ నెంబర్.32 ద్వారా గతంలో పునరావాస లబ్ధిదారులకు కేటాయించిన రాజరాజేశ్వరిపేట, వాంబేకాలనీలోని 2,763 ఇళ్లకు రిజిస్ట్రేషన్లను పూర్తి చేసినట్లు వెల్లడించారు. నిషేధిత భూముల జాబితా సెక్షన్ 22(ఏ)లో ఉన్న భూములను సదరు జాబితా నుంచి తొలగించి నార్త్ మండల పరిధిలోని 20,944 కుటుంబాలకు రిజిస్ట్రేషన్ హక్కు కల్పించడంతో ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న భూసమస్యకు శాశ్వత పరిష్కారం లభించిందన్నారు. జీఓ నెంబరు 60 ద్వారా 100 గజాల లోపు ఉన్న 115 కుటుంబాల ఇళ్లకు ఉచితంగా రిజిస్ట్రేషన్లు చేసినట్లు తెలిపారు. అలాగే అర్బన్ ల్యాండ్ సీలింగ్ జీఓ 84 ద్వారా అర్హులైన 264 మందికి హక్కులు కల్పించినట్లు చెప్పారు. నందమూరి నగర్లోని ఆర్అండ్‌బీ స్థలంలో 69 మంది నివాసులు దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న ఇళ్లస్థలాల రెగ్యులరైజేషన్ సమస్యకు జీఓ నెంబర్ 11 ద్వారా పరిష్కారం చూపడమైందని తెలిపారు. కస్తూరిభాయిపేట గిరిపురం పరిధిలోని నిరభ్యంతర ప్రభుత్వ భూముల్లోని ఇళ్ల స్థలాలను రెగ్యులరైజేషన్ చేసి 98 మందికి హక్కుతో కూడిన పట్టాలు పంపిణీ చేశామని పేర్కొన్నారు. అలాగే నియోజకవర్గం పరిధిలో 29,272 మంది నిరుపేదలకు జగనన్న కాలనీల్లో ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు వివరించారు. ఇంతటి చక్కని పాలన అందిస్తోన్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని మరోసారి ప్రజలందరూ నిండు మనస్సుతో ఆశీర్వదించాలని కోరారు.